https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

10 AM TO 1 PM

సంపుటి: 01 | సంచిక:21 | పేజీలు :02 | వెల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | ఆదివారం, సెప్టెంబర్ 06,2026


# 'గోవాలో' అంతర్జాతీయ తెలుగు కేంద్రం



**రవీంద్ర భారతి , ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:**

గోవా రాష్ట్రంలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని గుర్తించాలని గోవా ప్రభుత్వం కలెక్టర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేయడం పట్ల ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షుడు జగన్ బాబు గంజి, ప్రధాన కార్యదర్శి అశోక్ కంటే లు హర్షం వ్యక్తం చేశారు. గోవాలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో నిర్వహించిన వారధి, కవి సమ్మేళనం వంటి వివిధ కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. గోవాలో అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటు చెయ్యాలని గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు కు మే నెలలో ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. దానికి గవర్నర్ అశోక్ గజపతి రాజు ఆమోద ముద్ర వేసి రెవిన్యూ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జగన్ బాబు గంజి , అశోక్ కంటే లు మాట్లాడుతూ, తెలుగు అంతర్జాతీయ కేంద్రం తెలుగు భాషను ప్రోత్సహించడంతో పాటు, గోవాలో సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించడానికి పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. అంతర్జాతీయ తెలుగు కేంద్రం ఏర్పాటుకు సహకరించిన గోవా గవర్నర్, ముఖ్యమంత్రి, అధికారులందరికీ జగన్‌బాబు గంజి, అశోక్ కంటే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, దేశం నలుమూలలా విదేశాల్లో ఉన్న తెలుగు వారు ఈ ప్రాజెక్టులో పాల్గొని, తమ ఆలోచనలు, భాగస్వామ్యం అందించి మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర అధ్యక్షులు జగన్‌బాబు గంజి, కార్యదర్శి అశోక్ కంటే లు గోవా లో తెలుగు అంతర్జాతీయ కేంద్రం కోసం విశేష చేసినందుకుగాను పలువురు తెలుగు మేధావులు అభినందించారు.



## కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో విధ్వంసం

### : ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

**కోరుట్ల రూరల్ :ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ పల్లెలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అధ్వాన స్థితికి చేరుకున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని ఐలాపూర్ లాపూర్ గ్రామంలోపల్లెల విద్యాభివృద్ధి, పడకేసిన పారిశుధ్యానికి నిరసనగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ వైఫల్యాలను, పల్లెల పట్ల చూపుతున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.ప్రపంచ పటాలు పరిశీలించండిదేశంలో దాదాపు 6.5 లక్షల గ్రామాలు ఉంటే, ఉత్తమ గ్రామాల విభాగంలో కేంద్రం ప్రకటించిన 40 అవార్డుల్లో ఏకంగా 13 అవార్డులు (33 శాతం) సాధించి తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. నాడు కేసీఆర్ నాయకత్వంలో 'పల్లె ప్రగతి' ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠ ధామాలు ఏర్పాటు చేసి పరిశుభ్రతకు పెద్దపీట వేశారని కొనియాడారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాటా నిధులు రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి, పారిశుధ్యం లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో నాటిన 250 కోట్ల మొక్కలను సంరక్షించాల్సింది పోయి, అభివృద్ధి పనుల పేరిట చెట్లను విచక్షణారహితంగా నరికివేస్తున్నారని ఆరోపించారు. 420 హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్కు ప్రజలే బుద్ధి చెప్తాన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు ఇవ్వాలన్నారు. ?తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని, గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి పల్లెల అభివృద్ధిని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మండల అధ్యక్షుడు నత్తి రాజ్ కుమార్. నియోజకవర్గం బి ఆర్ ఎస్ శ్రేణులు ప్రజలు పాల్గొన్నారు



## సీవీ ఆనంద్ డీజీపీ అయిన తర్వాత క్రైమ్ రేట్ పెరిగింది: కవిత


**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:**

సీవీ ఆనంద్ డీజీపీ అయిన తర్వాత క్రైమ్ రేట్ పెరిగిందని టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తనపై కానిస్టేబుల్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేస్తే సస్పెన్షన్‌తో సరిపెడతారా అంటూ మండిపడ్డారు. తనపైన పెట్టిన పోస్టు డీజీపీ కుటుంబ సభ్యులపై పెడితే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. తనపైన పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు పెట్టి చర్యలు తీసుకోకపోతే ఇంటర్ నేషనల్ లెవెల్‌లో ప్రభుత్వాన్ని బదనాం చేస్తానని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..'ప్రజలు రేవంత్ రెడ్డిని నమ్మి సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్నారు. కోదండరాం పక్కన ఉన్నారు కాబట్టి రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారు. ఉద్యమకారులపై వేసిన కె.కె కమిటీ ఏమైంది? ఉద్యమకారులకు తెలంగాణ జన సమితి నుంచి కోదండరామ్ గుర్తింపు కార్డులు ఇచ్చారు. ప్రభుత్వం తరపున ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారులను తొక్కుకుంటూ పోతే ఎలా? అసెంబ్లీ సమావేశాల్లోపు ఉద్యమకారులపై సీఎం నిర్ణయం తీసుకోవాలి. కె.కె కమిటీ రిపోర్ట్ త్వరగా ఇవ్వాలి'..'అసెంబ్లీలో ప్రజా సమస్యల గురించి చర్చించకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కలిసి డ్రామాలు ఆడుతున్నాయి. నాయకుడు ఎక్కడ ఉంటే మాకెందుకు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలనేది డైవర్షన్‌లో భాగమే. అసెంబ్లీలో హేట్ స్పీచ్‌పై చట్టం చేయాలి. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ బీసీలపై 100 రోజుల కార్యాచరణ గురించి మాట్లాడితే నవ్వు వస్తుంది. బీసీల కోసం చేయాల్సిన పని కాంగ్రెస్ పార్టీ చేయడం లేదు. జనాభా లెక్కల సేకరణలో బీజేపీ తప్పు చేస్తోంది' అని అన్నారు.

## మధ్యప్రదేశ్‌లో విషాదం..

### కల్తీ మద్యం తాగి 9 మంది మృతి.!





మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సాగర్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కల్తీ మద్యం తాగి 9 మంది మృతి చెందినట్లు బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

**ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:**

మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో పలు గ్రామాలకు చెందిన వ్యక్తులు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందారు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ జిల్లాలోని బండా తహసీల్‌లోని ఓ మద్యం దుకాణంలో చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు శనివారం రాత్రి మద్యం తాగారు. ఇంటికి వచ్చిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురైయ్యారు. దీంతో కుటుంబసభ్యులు వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంలో చికిత్స పొందుతూ 9 మంది మృతి చెందారు. కాగా, పలువురి పరిస్థితి విషమంగా ఉంది.

**ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సుజానియా**

సమాచారం అందుకున్న ఎస్పీ అనురాగ్ సుజానియా ఘటనాస్థలాన్ని చేరుకుని పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా బండా తహసీల్‌లోని ఘూగర్,నౌరాజ్, బరాజ్ ఇతర చుట్టుపక్కల గ్రామస్థులు శనివారం రాత్రి ఓ దుకాణంలో మద్యం సేవించినట్లు గుర్తించామని తెలిపారు. అయితే, కల్తీ మద్యం తాగడం వల్లనే గ్రామస్థులు మరణించారని ఇప్పుడే నిర్ధారించలేమని ఆయన అన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతనే వాస్తవాలు బయటపడతాయని ఆయన అన్నారు.

### హైదరాబాద్‌లో గణేశ్ ఆగమన్ కార్యక్రమంలో

# తొక్కిసలాట.. విద్యార్థి మృతి

**గణపతి నవరాత్రులు రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'గణేశ్ ఆగమన్' కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. తొక్కిసలాటలో ఓ విద్యార్థి మృతి చెందాడు.**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6::

నగరంలోని ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ చౌరస్తాలో విషాదం చోటుచేసుకుంది. గణపతి నవరాత్రులు రానున్న నేపథ్యంలో స్థానిక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గణేశ్ ఆగమన్' కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో ఓ విద్యార్థి మృతి చెందాడు.ముషీరాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో 'శ్రీ గణపతి యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో గణేష్ ఆగమన్ కార్యక్రమం కోసం ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా ఒక్కసారిగా గూమిగూడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బద్రీనాథ్(19)అనే విద్యార్థి మృతి చెందారు. రాంనగర్‌లోని గౌరీశంకర్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న బద్రీనాథ్.. ఏపీలోని కడప జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.బద్రీనాథ్ నగరంలోని అబిడ్స్‌లో మెథొడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చదువుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# సముద్రం నేపథ్యంలో హై-వోల్టేజ్ యాక్షన్..

## సూరి, సుహాస్‌ల 'మండాడి' ట్రైలర్ విడుదల!

ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:

కోలీవుడ్ నటుడు సూరి హీరోగా, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ విలన్ పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'మండాడి' . సముద్రం నేపథ్యంలో రాబోతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను 'సెల్ఫీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. తమిళనాడులోని తీర ప్రాంతాలకు చెందిన సాంప్రదాయ బోట్ రేస్ పోటీల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సముద్రం నేపథ్యంలో సాగే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఇది రూపొందుతోంది. ఇందులో సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, తెలుగు నటుడు సుహాస్‌తో పాటు ప్రముఖ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ చాలా ఇంప్రెస్సివ్‌గా ఉంది. ఈ సినిమా కోసం హీరో సూరితో పాటు నటుడు సుహాస్ ఎలాంటి బాడీ డబుల్స్ లేకుండా సముద్రంలో రిస్కీ యాక్షన్ సన్నివేశాలు, బోట్ రేస్ సీక్వెన్స్‌లలో చాలా కష్టపడి నటించినట్లు తెలుస్తుంది.



# కోడిపందేల స్థావరంపై దాడి, 22 మంది అరెస్ట్..

## రూ.3 లక్షల నగదు, 31 కోళ్లు స్వాధీనం

ఆదిభట్ల : ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:

రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని రాజేశ్వర్‌రెడ్డి పౌల్ట్రీ ఫామ్‌లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తూ నగదు పందెం కాస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఓటీ, ఆదిభట్ల పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఆదిభట్ల ఏసీపీ అనుమతితో ఎస్ఐ ఇద్దరు మధ్యవర్తులు, పోలీసు సిబ్బందితో కలిసి స్థావరానికి చేరుకున్నారు.పోలీసులను గమనించిన కొందరు అక్కడి నుంచి పరారయ్యారు. పట్టుబడిన 22 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితుల నుంచి 31 కోళ్లు, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ఆదిభట్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# గుండెపోటుతో జార్ఖండ్ మంత్రి సుదివ్య కుమార్ సోను మృతి

ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:



జార్ఖండ్‌ముక్తి మోర్చా పార్టీ (జీవీవీ) సీనియర్ నాయకుడు, సాంకేతిక విద్యా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సుదివ్య కుమార్ సోను(56) గుండెపోటుతో మరణించారని ఆ పార్టీ ఆదివారం తెలిపింది. శనివారం రాత్రి అస్వస్థతకు గురైన మంత్రినిరాంచీలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అయితే.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల సమయంలో గుండెపోటుతోఆయన కన్నుమూశారు.సోను 2019లో గిరిడీహ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. ఉన్నత విద్య, పట్టణాభి వృద్ధితో పాటు పర్యాటకం, కళలు, సాంస్కృతికం, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.సోను మృతిపై సీఎం హేమంత్ సోరెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయననో విశ్వసనీయ సహచరుడు, మార్గదర్శి, జార్ఖండ్ ఉద్యమానికి అంకితమైన నేతగా స్మరించుకున్నారు సోరెన్. మరోవైపు.. మంత్రి మృతిపై జేఎమ్ఎమ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. జేఎమ్ఎమ్ పార్టీ సహా ప్రభుత్వానికి, జార్ఖండ్‌కు ఇది తీరని లోటు అని పేర్కొంది.

# హైదరాబాద్ మెట్రోకు కొత్త కోచ్‌లు..

## తెరపైకి వచ్చిన సాంకేతిక సమస్య



- హైదరాబాద్ మెట్రోలో కొత్త కోచ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ సన్నాహాలు
- పాత సిగ్నలింగ్ వ్యవస్థతో అనుసంధానంపై సాంకేతిక సవాలు
- మొత్తం వ్యవస్థను ఆధునికీకరించాలని సూచించిన డీఎంఆర్‌సీ
- భవిష్యత్ అవసరాల కోసమే ఈ సిఫార్సు అని నిపుణుల అభిప్రాయం
- రద్దీని తగ్గించేందుకు 60 కొత్త కోచ్‌ల కొనుగోలుకు నిర్ణయం

ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు మెట్రో రైలు వ్యవస్థలో అదనపు కోచ్‌లను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తుండగా, ఈ ప్రక్రియలో ఒక కీలకమైన సాంకేతిక సవాలు ఎదురైంది. కొత్తగా కొనుగోలు చేసే కోచ్‌లను పాత సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయాలా? లేక మొత్తం సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థనే ఆధునికీకరించాలా? అనే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. అయితే, ప్రస్తుత వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించడమే దీర్ఘకాలంలో ప్రయోజనకరమని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) నిపుణులు సూచించినట్లు తెలిసింది.ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో 57 రైలు సెట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగడంతో ఈ రైలు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు 60 కొత్త కోచ్‌లు, అంటే 10 కొత్త మూడు కోచ్‌ల ట్రైన్ సెట్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.అయితే, దాదాపు 12 ఏళ్ల నాటి సాంకేతికతతో నడుస్తున్న ప్రస్తుత వ్యవస్థతో కొత్త కోచ్‌లను అనుసంధానించడం పెద్ద సవాలుగా మారింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో ఏర్పాటు చేసిన రోలింగ్ స్టాక్‌ను ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ), ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్ (ఏటీఓ), కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ (సీబీటీసీ) వంటి టెక్నాలజీలతో రూపొందించారు. ఇటీవల హైదరాబాద్‌లో పర్యటించిన డీఎంఆర్‌సీ ఇంజినీర్లు ఈ అంశంపై మెట్రో అధికారులతో చర్చించారు. పాత టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోచ్‌లను ప్రత్యేకంగా తయారు చేయించడం కంటే, మొత్తం సిగ్నలింగ్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడమే ఉత్తమమని వారు అభిప్రాయపడినట్లు సమాచారం.సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రస్తుతం ఉన్న పాత కోచ్‌లలో అవసరమైన మార్పులు చేస్తే, భవిష్యత్తులో కొత్త రైళ్లను సమీకరించడం చాలా సులభం అవుతుంది. దీనివల్ల పాత, కొత్త రైళ్ల మధ్య సాంకేతిక అనుసంధానం మెరుగుపడుతుంది. అంతేకాకుండా రైళ్ల భద్రత, వేగం, సమయపాలన మరింత మెరుగుపడతాయి. ఈ విధానం వల్ల మెట్రో వ్యవస్థ భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా సిద్ధమవుతుందని, దీర్ఘకాలంలో నిర్వహణ కూడా సులభతరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ సూచనల ఆధారంగా తుది నిర్ణయం తీసుకునేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# కౌంటీలో చెలరేగిన సాయి కిశోర్..

## టీమిండియా సెలెక్టర్లకు గట్టి సవాల్!

ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:


భారత జట్టులో చోటు కోసం ఎదురుచూస్తోన్న తమిళనాడు స్పిన్నర్ సాయి కిశోర్ మరోసారి సత్తా చాటాడు. ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో గ్లాస్టర్‌షైర్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తోన్న కిశోర్.. అదిరిపోయే ప్రదర్శన చేశాడు. డెర్బీషైర్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 20 పరుగులిచ్చి 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. తన సూపర్ స్పెల్‌తో టీమిండియా సెలెక్టర్లకు మరోసారి సవాల్ విసిరాడు.రెడ్ బాల్ క్రికెట్‌లో సాయి కిశోర్‌కు మంచి రికార్డు ఉంది. రంజీ ట్రోఫీలో నిలకడగా రాణిస్తున్న అతడు.. ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లోనూ వరుసగా ప్రభావం చూపిస్తున్నాడు. అయినా భారత టెస్టు జట్టులో మాత్రం అతడికి చోటు దక్కడం లేదు. కౌంటీ క్రికెట్‌లో ఇలాంటి ప్రదర్శనలతో టెస్టు క్రికెట్‌కు సిద్ధంగా ఉన్నాననే సంకేతాన్ని సాయి కిశోర్ మరోసారి సెలెక్టర్లకు పంపాడు.
దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు, ఎడమచేతి వాటం స్పిన్నర్‌గా ఉండటం, ఇంగ్లండ్ పరిస్థితుల్లోనూ రాణించే సామర్థ్యం.. ఇవన్నీ అతడికి కలిసొచ్చే అంశాలే.




# హార్మూజ్‌లో ఆగని ఉద్రిక్తతలు..

## అమెరికా యుద్ధనౌకలపై ఇరాన్ ఎటాక్..!


ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:



ఇరాన్- అమెరికా దేశాల మధ్య పరస్పర దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఘర్షణలను తీవ్రం చేస్తూ.. ఐఆర్‌జీసీ దళాలు అగ్రరాజ్యానికి చెందిన విమాన వాహక నౌక, డెస్ట్రాయర్‌పై బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడ్డాయి. అమెరికా యుద్ధ నౌకలు హార్మూజ్ లో ఇరాన్ ట్యాంకర్లను అడ్డుకుంటుండడంతో.. వాటిని లక్ష్యంగా చేసుకున్నట్లు టెహ్రాన్ ప్రకటించింది.ఈ దాడుల్లో అమెరికా యుద్ధ నౌకలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఆ తర్వాత అవి హార్మూజ్‌ను విడిచి వెళ్లిపోయాయని తెలిపింది. శనివారం హార్మూజ్‌లోని ఇరాన్ చమురు ట్యాంకర్లపై అమెరికా దాడుల అనంతరం ఐఆర్‌జీసీ ఈ దాడులకు పాల్పడింది. హార్మూజ్‌లో అనధికారిక మార్గాల్లో ప్రయాణిస్తున్న మూడు ట్యాంకర్లను, అమెరికాకు అనుబంధంగా ఉన్న మరో మూడు నౌకలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.ఇరాన్ నౌకల విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తూ దాడులు కొనసాగిస్తే తమ నుంచి గట్టి ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఆ దేశ సైనిక నౌకలపై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. గతంలో కంటే తాము ఇప్పుడు మరింత బలంగా ఉన్నామని పేర్కొన్నది. కాగా మరోవైపు ఇరాన్ దాడుల నుంచి తమ నౌకలు సురక్షితంగా తప్పించుకున్నాయని అమెరికా ప్రకటించింది.ఇరాన్ దాడుల్లో తమ సిబ్బందికి ఎటువంటి గాయాలు కాలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నది. తమ నౌకాదళాన్ని లక్ష్యంగా చేసుకుంటే ఇరాన్ నౌకలపై దాడులు మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

# బద్ధలైన అగ్నిపర్వతం..

## విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం..



ట్రైనెట్ న్యూస్ , సెప్టెంబర్ 6:

ఇండోనేషియా లోని అనక్ క్రాకటౌ అగ్నిపర్వతం ఆదివారం తెల్లవారుజామున బద్దలైంది. దాని నుంచి దాదాపు 50 వేల అడుగుల ఎత్తుకు మందపాటి బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసింది. ఈ అగ్నిపర్వతం శుక్రవారం నుంచి క్రియాశీలంగా ఉన్నట్లు వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు.దాంతో వెంటనే స్థానిక గ్రామాలను ఖాళీ చేయించామని, పర్వతారోహకులకు, సందర్శకులకు అనుమతి నిలిపివేశామని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం చోటుచేసుకోలేదని చెప్పారు. పర్వతం నుంచి బూడిద భారీగా ఎగసిపడుతుండడంతో సుకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని సర్వీసులను రద్దు చేసినట్లు ఇండోనేషియా పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ వెల్లడించారు.అగ్నిపర్వతం బద్దలు కావడంతో 209 విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 22,800 మంది ప్రయాణికులపై ప్రభావం పడింది.